

మైనంపల్లిని చుట్టుముట్టిన కార్యకర్తలు

# మైనంపల్లి రాజీనామా నిర్ణయం ఉపసంహారణ

**హైదరాబాద్, సంగారెడ్డి- న్యూస్‌టుడే:** మెదక్ శాసనసభ్యుడు మైనంపల్లి హన్మంతరావు తన రాజీనామా నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. ప్రత్యేక తెలంగాణకు మద్దతుగానే తాను పదవి నుంచి వైదొలగాలని అనుకున్నప్పటికీ ఐకాస నుంచి సానుకూల స్పందన లభించలేదన్నారు. అందుకే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతకు ముందు మెదక్ నుంచి వచ్చిన కార్యకర్తలు రెండు గంటల పాటు అల్వాల్‌లోని హన్మంతరావు ఇంట్లో ఆయనను చుట్టుముట్టి రాజీనామా నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేశారు. ఒక కార్యకర్త ఆత్మహత్యకు యత్నించారు.

**స్పీకర్ ఖండన:** మైనంపల్లి రాజీనామాను ఆమోదించలేదని తాను అన్నట్లు వచ్చిన కథనాన్ని శాసనసభ స్పీకర్ ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డి ఖండించారు. రేణిగుంట విమానాశ్రయంలో ఆదివారం ఎమ్మెల్యే తనకు లేఖ సమర్పించారని, అప్పుడు తాను ఏ విధంగానూ స్పందించలేదని చెప్పారు.

**నాటకమని తేలిపోయింది.. తెరాస:** మైనంపల్లి నాటకమాడినట్లు స్పష్టమైందని, ఆయన అసలు రంగు బయటపడిందని తెరాస విమర్శించింది. పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌లు మీడియాతో మాట్లాడారు. తెరాసపై సవాలు విసురుతూ రాజీనామా చేసిన మైనంపల్లి ఇప్పుడు ఎందుకు తోకముడిచారో బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు గుప్పిట్లో కీలుబొమ్మగా ఉన్నారని విమర్శించారు.